క్లుప్తంగా

పండ్లు, కూరగాయలతో రోగనిరోధక శక్తి పెరుగుదల



కూరగాయలతో అలంకరించి అమ్మవారి పూజలో విద్యార్థులు

మీర్‌పేట: మానవాళికి ప్రకృతి అందించిన గొప్ప వరం పండ్లు, కూరగాయలని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేట నాగార్జున మాంటిస్సోరీ, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్లో నిర్వహించిన శాకాంబరి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీజనల్ వారీగా లభించే పండ్లు, కూరగాయలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పోషక విలువల గురించి చిన్నారులకు అవగాహన కల్పించేందుకే పాఠశాలలో ఏటా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మహేష్, ఇన్‌చార్జిలు దుర్గ, సంధ్య, ప్రశాంతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని సత్య హరిశ్చంద్ర శ్మశాన వాటిక నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా యంజాల దర్శన్, ఉపాధ్యక్షుడిగా సురేష్, ముఖ్య కార్యదర్శిగా జీఆర్ దానయ్య, సంయుక్త కార్యదర్శిగా యంజాల మహేందర్, కోశాధికారిగా వై జంగయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా కంచ మహేందర్, వై నర్సింహా, యంజాల అర్జున్, సలహాదారులుగా ఆవుల శ్రీశైలం, యంజాల మహేందర్, రామారావు, నర్సింహా, యాదగిరిలు ఎన్నికయ్యారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం



నేదునూరులో లింగమయ్యచారికి నగదు అందిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు బీజేపీ నాయకులు ఇల్లు లేక వ్యక్తికి ఆర్థికసాయం చేశారు. మండలంలోని నేదునూరులో ఇల్లు లేక ప్లాస్టిక్ కవర్లు కింద నివసిస్తున్న వడ్ల లింగమయ్యచారి ఇంటి నిర్మాణానికి రూ.30 వేలను శుక్రవారం అందజేశారు. భవిష్యత్‌లో ఎలాంటి అవసరం వచ్చినా తాము అండగా నిలబడతామని ఆయనకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, బాల్‌రాజ్, వెంకటేష్, రవీందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మైసయ్య, మహిపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యాదగిరి, హన్మంత్‌రెడ్డి, వరుణ్‌కుమార్, రవీందర్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీశైలం, రవి పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటండి

కందుకూరు: చిన్నతనం నుంచే చెట్లను విరివిగా నాటి సంరక్షించుకోవడం ఓ బాధ్యతగా చేపట్టాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జయమోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడం వరకే కాకుండా, నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకుందామన్నారు. చెట్లు ప్రగతికి మెట్ల లాంటివన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎండీ అబ్దుల్లా, ఉపాధ్యాయులు గ్లోరి, సురేష్, కృష్ణ, కరుణాకర్, కౌసల్య, డాక్టర్ ఎండీ బషీర్, వాణిశ్రీ, సిబ్బంది సర్వర్, శ్రీశైలం, హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కందుకూరు: పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి శ్రీశైలం రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ సరితకు వినతి పత్రం అందించారు.



దాసరి నారాయణరావు కాలనీలో నిరుపయోగంగా..



కమలానెహ్రూనగర్‌లో షెడ్డులో వాహనాల పార్కింగ్

అలంకారప్రాయంగా షెడ్లు!

- ఏడాది గడుస్తున్నా వీధి వ్యాపారులకు కేటాయించని దుకాణాలు
- నిరుపయోగంగా షెడ్లు
- పట్టించుకోని అధికారులు

మీర్‌పేట: ఆర్భాటంగా ప్రారంభించారు.. కానీ అలంకార ప్రాయంగానే మిగిలిపోయింది. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని కమలానెహ్రూనగర్, దాసరి నారాయణరావు కాలనీల్లో రూ.10 లక్షల వ్యయంతో సంవత్సరం క్రితం స్థానికంగా ఉండే వీధి విక్రయదారుల ఉపయోగార్థం మొత్తం పది షెడ్లను నిర్మించారు. వాటిని వీధి వ్యాపారులకు కేటాయించకపోవడంతో అవి నిరూపయోగంగా మారాయి. వాటిని వాహనదారులు, స్థానికులు పార్కింగ్‌కు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లను వారికి కేటాయించకపోవడంతో నిర్వహణ లేక శిథిలావస్థకు చేరే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎమ్మెల్యే పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారిలో చలనం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షెడ్లపక్కనే చెత్త డంపింగ్...

షెడ్ల కేటాయింపు చేపట్టకపోవడంతో చెత్త డంపింగ్‌కు, వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోతుందని స్థానికులు తెలిపారు. కమలానెహ్రూనగర్ కాలనీలోని షెడ్లు పూర్తిగా వాహనాల పార్కింగ్‌తో నిండిపోతుంది. అదే విధంగా దాసరి నారాయణరావు కాలనీలో షెడ్ల పక్కనే చెత్త డంప్ చేస్తుండడంతో దుర్వాసన అపరిశుభ్రత నెలకొంది. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

> **త్వరలోనే కేటాయిస్తాం..**
>
> షెడ్ల కేటాయింపునకు సంబంధించి ఇప్పటికే లబ్ధిదారులను ఎంపిక చేశాం. ముందుగా షెడ్ల వద్ద శుభ్రం చేయించి వారం రోజుల్లోగా స్థానిక వీధి వ్యాపారులకు అప్పగిస్తాం.
>
> – దుర్గాదీప్‌లాల్ చౌహాన్, మేయర్

జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తత ముఖ్యం

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలంలో ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా బస్తీలలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, 21వ వార్డు కౌన్సిలర్ షమిదా అఫ్జల్‌లు ఆమెకు వివరించారు. ముఖ్యంగా డెంగీ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో దోమల నివారణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించడంతో పాటు చెత్త పడేసే పాయింట్ల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను కూడా చల్లుతున్నామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామన్నారు. ప్రజలంతా తమ ఇళ్లల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకరోజు నీటిని పూర్తిగా పారబోసి, కొత్తగా పట్టుకోవాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తా చెదారాలు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. పాడైన రోడ్లకు కూడా మరమ్మతులు చేపడుతామని తెలిపారు. 22వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకుడు సయ్యద్ హుస్సేన్ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు.



వాదే ముస్తఫా బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ వాణిరెడ్డి

కాలనీల సమస్యలు పరిష్కరిస్తాం

మేయర్ చిగురింత పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆయా కార్పొరేటర్లతో కలిసి పరిష్కరిస్తామని బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌లోని మెట్రో కాలనీలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆమె స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్ల అభివృద్ధి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు ఆగిపోయినట్లు గుర్తు చేశారు. మెట్రో కాలనీలో డ్రైనేజీ పూర్తి అయిన వెంటనే సీసీ రోడ్లు వేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఈ బిక్కునాయక్, నాయకులు రాకేష్, యాదగిరి కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్ స్వప్న

వర్గీకరణకు అనుకూలంగా బిల్లు పెట్టాలి

కందుకూరు: ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు చిన్నగళ్ల యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గడ్డం రాంచందర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆగస్టు 9న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న ఎస్సీ వర్గీకరణను చేపట్టకపోవడం బాధ్యతారాహిత్యమేనన్నారు. వర్గీకరణ చేస్తారని ఎస్సీలు బీజేపీని బలపర్చారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆదిరాల రవికుమార్, జిల్లా ఇన్‌చార్జి దేవని నర్సింహా, పెద్దరామయ్య, బొర్ర రాములు, ఎ.బాల్‌రాజ్, ఉన్ని వెంకటయ్య, ఊటు యాదగిరి, కె.క్రిష్టోఫర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం చేశారని నిరసిస్తూ శుక్రవారం బడంగ్‌పేట అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీజేపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటి భాస్కర్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఎస్సీ కులాల అభివృద్ధి కోసం రూ.36.75 వేల కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. మొదటి సారి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.33.15 వేల కోట్లకు తగ్గించారన్నారు. దళితులపై కాంగ్రెస్ పార్టీకి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలిసిపోయిందని ఎద్దేవ చేశారు. బడ్జెట్‌లో దళితులకు తగిన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు గడ్డం వెంకటేష్, జిల్లా కార్యదర్శి గుండె నాగార్జున, బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, జగదీశ్వర్, మల్లేష్, రవికాంత్‌రెడ్డి, నర్సింహ, రాజేందర్, పోలేరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేసేలా శ్రేణులు తరలిరావాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్ఆర్ రానున్నారన్నారు. పార్టీ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌ముదిరాజ్, పాండు, ప్రశాంత్‌కుమార్, జగన్, వీరారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బడంగ్‌పేట్: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ పారిజాత, కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని శానిటేషన్ ఆధ్వర్యంలో 30వ డివిజన్‌లోని కాలనీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వర్షపు నీటితో నిండి ఉన్న డబ్బాలను, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దన్నారు. వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో మూటలు కట్టి ఓపెన్ ప్లాట్లల్లో రోడ్లకు ఇరువైపుల పడేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, ఎన్జీవోస్ సభ్యులు, శానిటేషన్ జవాన్లు పాల్గొన్నారు.



నీళ్లల్లో మందులు వేస్తున్న మేయర్, కార్పొరేటర్, అధికారులు

ఆకాన్‌పల్లిలో వన మహోత్సవం

మహేశ్వరం: ఆకాన్‌పల్లిలో వన మహోత్సంలో భాగంగా శుక్రవారం మండల ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మీ, ఎంపీడీఓ శైలజారెడ్డి మొక్కలు నాటారు. అనంతరం నర్సరీ, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. మండల పరిషత్ సమావేశపు హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ పరిమళ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు, వైద్యురాలు తదితరులు

కందుకూరు: కందుకూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన బూన్ ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ సహకారంతో శుక్రవారం మండల కేంద్రంలోని భూలక్ష్మి మెమోరియల్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరంలో డాక్టర్ శ్రావ్య తాళ్లపురెడ్డి సంతానం లేని దంపతులను పరీక్షించారు. మొత్తం 42 మందికి పరీక్షలు నిర్వహించి 12 మందిని హైదరాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్‌కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలి, ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం తదితర కారణాలతో పునరుత్పత్తి శాతం తగ్గుతోందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సురసాని విఠల్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లుగుప్తా, పీఏసీఎస్ డైరెక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



మీర్‌ఖాన్‌పేటలో గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

కందుకూరు: తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కళాకారుల బృందం శుక్రవారం మీర్‌ఖాన్‌పేటలో పర్యటించింది. పరిసరాల పరిశుభ్రత, వాన నీటి సంరక్షణతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు అర్థమయ్యేలా కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. టీం లీడర్ ఏ.అనిల్‌కుమార్, కళాకారులు డాక్టర్ లింగా శ్రీనివాస్, నిఖిలేశ్వర్, కరుణ, సత్యవాణి, సునీత, రాజేశ్వరి, అమూల్య, జోష్న, అపూర్వ, దీక్షిత, సంధ్య, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

లోటస్‌ల్యాప్‌లో కార్గిల్ విజయ్ దివస్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లలితారెడ్డి మాట్లాడుతూ దేశభక్తిని చాటుకునేలా దేశ సైనికులు చేసినటువంటి గొప్ప త్యాగాన్ని విద్యార్థులకు గుర్తు చేసేవిధంగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధ సమయంలో జరిగిన పరిణామాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి వేడుక



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామంలో నాభిశిలా(బొడ్రాయి) ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఉదయం వేద స్వస్తి, మహాగణపతి పూజ, పుణ్య వచనము తదితర పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞం, గణపతి హోమం, విగ్రహాల శుద్ధి, జలాధివాసం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ బిందెతో నీళ్ల సమర్పించారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన కొనసాగనుంది. స్థానిక కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్‌కుమార్ యాదవ్‌ల పర్యవేక్షణలో పూజలు కొనసాగుతున్నాయి.



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్లు శివకుమార్, పవన్‌కుమార్‌యాదవ్